

అనుమతులపై కసరత్తు
గద్వాలలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాన్ని ఎన్‌ఎంసీ సభ్యులు పరిశీలించారు.
వివరాలు 8లో ▸



కోటకొండలో రాస్తారోకో
తమ వారిని అక్రమంగా అరెస్టు చేశారని పేట మండలం కోటకొండలో రాస్తారోకో చేపట్టారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.2 /24.1

వాతావరణం
రోజులో అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. ఎండ తీవ్రత అంతగా ఉండదు. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీలో 52 శాతం ఉత్తీర్ణత

వనపర్తిటౌన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. జిల్లావ్యాప్తంగా 4,001 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 2,217 మంది ఉత్తీర్ణులు కాగా.. 1,784 మంది ఫెయిలయ్యారని డీఐఈఓ మద్దిలేటి తెలిపారు. ఫస్టియర్ జనరల్‌లో బాలురు 1,804 మందికిగాను 864 మంది, బాలికలు 1,708 మందికిగాను 1,101 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో బాలురు 279 మందికిగాను 112 మంది, బాలికలు 201 మందికిగాను 140 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే రెండో సంవత్సరం జనరల్‌లో బాలురు 1,088 మంది పరీక్ష రాయగా 370 మంది, బాలికలు 730 మందికిగాను 283 మంది పాసయ్యారు.

'రేపు పాఠశాలల బంద్'



వనపర్తి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపునిచ్చిందని సంఘం పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ తేజ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా.. నేటికీ విద్యా వ్యవస్థపై దృష్టి సారించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటి వరకు మౌలిక వసతులు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకు ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీలు పెరిగిపోతున్నాయని.. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అర్జున్, నాయకులు కార్తీక్, నిఖిల్, హరికృష్ణ, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరిస్తే తగిన గుణపాఠం



వీపనగండ్ల: ప్రజా సమస్యలు విస్మరించే పార్టీలకు ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం మండలంలోని బొల్లారం గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను త్వరగా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు కృష్ణయ్య, మహబూబ్‌పాషా, నాగిరెడ్డి, వంక కృష్ణయ్య, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, బాలగౌడ్, వెంకటమ్మ, చిట్టెమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా హెచ్‌డబ్ల్యూఓ, డీఏఓ పరీక్షలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ గ్రేడ్‌– 2, డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలు సోమవారం నుంచి శనివారం వరకు జరుగనున్నాయి. ఈ మేరకు జిల్లాకేంద్రంలో జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ, ఫాతిమా స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలిరోజు 730 మంది పరీక్షకు హాజరయ్యారు. అయితే జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కాలేజీ సెంటర్‌లో ఉదయం 9.30 గంటలలోపు హాజరైన అనుమతి ఇవ్వలేదని కొంతమంది దివ్యాంగులు వాపోయారు.

దేవాదాయశాఖలో కదలిక

ధూపం, దీపం, నైవేద్యం సమర్పయామిపై ఉన్నతాధికారుల ఆరా

- లేని ఆలయానికి పథకం వర్తింపచేయడంపై విస్మయం
- కమిషనర్ ఆదేశాలతో గోప్యంగా సాగుతున్న విచారణ
- తప్పించుకునేందుకు అవినీతి అధికారుల తంటాలు
- రాజకీయ నేతలతో సంప్రదింపులు
- రాష్ట్రస్థాయి అధికారులపై ఒత్తిళ్లు తెచ్చేలా చర్యలు



అయ్యగారికే శఠగోపం..!
దేవుడా..
ధూపం, దీపం, నైవేద్యం, సమర్పయామి!

'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనాలు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దేవాదాయశాఖలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ధూప, దీప, నైవేద్య పథకంలో అవినీతి పర్వంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ పథకం కింద అర్చకులకు ప్రభుత్వం నెలకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో పలువురు పాలకమండలి సభ్యులు, పెద్దలు కొందరు అర్చకులపై ఒత్తిడి తెచ్చి కమీషన్ ఇవ్వాలని బెదిరింపులకు గురి చేస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో గత నెల 30న 'అయ్యగార్లకే శఠగోపం' శీర్షికన కథనం ప్రచురితమైంది. అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్‌తో పాటు పలు ప్రాంతాల్లో నిబంధనలు విస్మరించి లేని ఆలయాలకు సైతం ధూప, దీప నైవేద్య పథకం వర్తింపచేయడంపై 'దేవుడా.. ధూపం, దీపం, నైవేద్యం సమర్పయామి..!' శీర్షికన ఈ నెల 22న మరో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ పథకంలో అవినీతి కొనసాగిన తీరు, ప్రజాధనం వృథా కావడంపై పలు ఉదాహరణలతో కథనాలు ప్రచురితం కాగా.. దేవాదాయ శాఖలోని రాష్ట్రస్థాయి అధికారులు స్పందించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆశాఖ కమిషనర్ ఆదేశించారు.

రామకృష్ణకు విచారణ బాధ్యతలు

ప్రధానంగా లేని ఆలయాలకు ధూప, దీప, నైవేద్య పథకం అమలు చేసిన అంశాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యమా.. ధన దాహంతో ఈ విధంగా చేశారా.. ఒక్క ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనేనా.. రాష్ట్రవ్యాప్తంగా ఈ దందా కొనసాగిందా.. అనే దానిపై క్షేత్రస్థాయిలో కూపీ లాగాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు ముందుగా ఉమ్మడి జిల్లాలోని పులికల్‌లో చోటుచేసుకున్న వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఇందుకు దేవాదాయశాఖలో హైదరాబాద్ పరిధిలో ఆర్‌జేసీ (రీజియన్ జాయింట్ కమిషనర్)గా విధులు నిర్వర్తిస్తున్న రామకృష్ణను విచారణ అధికారిగా నియమించారు. ఇప్పటికే ఆయన గుట్టుచప్పుడు కాకుండా తన విచారణ మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో ఏం జరిగిందనే దానిపై ఆయన ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చినట్లు సమాచారం. త్వరలో క్షేత్రస్థాయిలో పులికల్‌లో పర్యటించి అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్లు తెలుస్తోంది.

అవినీతి ఉద్యోగుల్లో గుబులు..

లేని ఆలయాలకు ధూప, దీప, నైవేద్య పథకం అమలు చేయడంపై క్షేత్రస్థాయిలో జరుగుతున్న విచారణతో దేవాదాయశాఖలోని అవినీతి అధికారులు, సిబ్బందిలో గుబులు మొదలైంది. ఈ మేరకు తప్పించుకునేందుకు మార్గాలను అన్వేషిస్తున్నట్లు వారి చర్యలను బట్టి తెలుస్తోంది. పలు జిల్లాల్లో తనకు అనుకూలంగా ఉన్న అర్చకులతో సంప్రదిస్తున్నట్లు సమాచారం. తమకేమైనా జరిగితే మీకు ధూప, దీప, నైవేద్య పథకం కింద నెలకు రావాల్సిన రూ.10 వేలు రావని బెదిరింపులకు దిగుతున్నట్లు వినికిడి. అదేవిధంగా తనకున్న పరిచయాలతో రాజకీయ నేతలను సంప్రదించడమే కాకుండా.. వారితో ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెచ్చే విధంగా ముందుకు సాగుతున్నట్లు ఆ శాఖ ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

విచారణ చేపట్టాం..

పులికల్‌లో రంగనాథస్వామి ఆలయం పేరిట ఇంట్లో ఉన్న గదికి ధూప, దీప, నైవేద్య పథకం అమలు చేయడంపై విచారణకు ఆదేశించాం. వారంలో నివేదిక ఇవ్వాలని సూచించాం. అది అందగానే తగిన చర్యలు తీసుకుంటాం.

– కృష్ణవేణి, అడిషనల్ కమిషనర్, దేవాదాయ శాఖ

పకడ్బందీగా ఉచిత విద్యుత్



శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

- తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి
- జల విద్యుత్ నాలుగో యూనిట్ పునరుద్ధరణకు టెండర్లు
- శ్రీశైలం హైడల్ ద్వారా పెద్దఎత్తున విద్యుదుత్పత్తిపై సుదీర్ఘ సమీక్ష
- రాష్ట్రంలో రెప్పపాటు కరెంట్ కోతలు లేకుండా చర్యలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


సాక్షి, నాగర్‌కర్నూల్/ అచ్చంపేట/ దోమలపెంట/ మన్ననూర్: రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, అందుకు శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబిక అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వినియోగదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ కల్పించడంపై పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరుసగా ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పథకం అమలులో కొంత జాప్యం జరిగిందని, ఇప్పటి వరకు అర్హులు ఎవరైనా విద్యుత్ బిల్లులు చెల్లించి ఉంటే వారి డబ్బులను ప్రభుత్వం తిరిగి ఇచ్చేస్తుందని స్పష్టం చేశారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులతోపాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పర్ణికారెడ్డిలతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాన్ని స్వయంగా పరిశీలించి డిప్యూటీ సీఎం మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైడల్ ప్రాజెక్టు ద్వారా పెద్దఎత్తున విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఆనాటి కాంగ్రెస్ పెద్దలు ముందుచూపుతో నిర్మించిన శ్రీశైలం బహుళార్థక ప్రాజెక్టుతో మన జీవితాల్లో వెలుగులు నింపిన అమరజీవులకు నివాళులర్పించారు. శ్రీశైలం హైడల్ ప్రాజెక్టు ద్వారా అత్యధిక స్థాయిలో విద్యుదుత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. హైడల్ ప్రాజెక్టులో 4వ యూనిట్ పునరుద్ధరణ కోసం టెండర్ ఫర్ కాల్ చేయాలని అధికారులను ఆదేశించారు. యూనిట్ పునరుద్ధరణలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్ట్ సంస్థలను బ్లాక్ లిస్టులో చేర్చాలని సూచించారు. 2020లో భూగర్భ పవర్ హౌజ్‌లో జరిగిన ప్రమాద ఘటన తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమావేశంలో జెన్కో సీఎండీ రిజ్వీ, భూగర్భ కేంద్రం ఎస్‌ఈ ఓఅండ్‌ఎం ఆదినారాయణ, ఎస్‌ఈ సివిల్ రవీంద్రకుమార్, జూరాల ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, ఎస్‌పీఎఫ్ ఏసీ ఎంఎస్ రెడ్డి, ఆర్‌ఐ సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారాలు

రాష్ట్రంలో విద్యుత్ కోతలున్నాయంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, రెప్పపాటు కరెంట్ కోతలు కూడా లేవని భట్టి అన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీకి 108 ఉన్నట్లే విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 నంబర్‌ను అందుబాటులోకి తెచ్చామని, విద్యుత్ సమస్యలపై ఈ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. విద్యుత్ షాక్‌తో మృతిచెందిన అచ్చంపేట మండలం ఘన్‌పూర్‌కు గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం

నల్లమలకు విచ్చేసిన రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు దారిపొడవునా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. మన్ననూర్‌లోని వనమాలిక ప్రాంగణంలో పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి, ఆర్డీఓ మాధవి, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అంతకు ముందు మన్ననూర్ కూడలిలో నిరంజన్‌షావలి దర్గా, లింగమయ్యస్వామి ఆలయంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి తదితరులు ప్రార్థనలు, ప్రత్యేక పూజలు చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. అలాగే ఆదివాసీ కార్పొరేషన్‌లో చెంచు తెగలకు నామినేట్ విధానంలో రెండు డైరెక్టర్ పోస్టులు కేటాయించాలని చెంచు సేవా సంఘం నాయకులు కోరారు. అలాగే మహిళా సమాఖ్య ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉపాధ్యాయ, అంగన్‌వాడీ సమస్యలపై సైతం మంత్రికి వినతిపత్రం అందించారు.



భూగర్భ కేంద్రం ఇంజినీర్లతో సమీక్ష నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడి, పర్ణికారెడ్డి

'ప్రజావాణి' అర్జీలకు ప్రాధాన్యం



ప్రజావాణిలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో అదనపు కలెక్టర్

- కలెక్టర్ ఆదర్శ సురభి


వనపర్తి: ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యమిచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని వినతులు స్వీకరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు 97 అర్జీలు దాఖలు కాగా.. కలెక్టర్, అదనపు కలెక్టర్లు పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాస్థాయి అధికారులు ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి విధిగా హాజరుకావాలని, పరిష్కరించిన విషయాన్ని అర్జీదారుతో పాటు తనకు నివేదికగా ఇవ్వాలన్నారు. ఈ–ఆఫీస్ విధానం మరో వారం రోజుల్లో అమలులోకి రావాలని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇక ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ–ఆఫీస్ విధానంలోనే జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్, జిల్లా అధికారులు.. వివిధ మండలాల తహసీల్దార్లు వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు.

ధరణి అర్జీలు పరిష్కరించాలి..

పెండింగ్ ధరణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, సక్సెషన్ యాక్ట్ గురించి పూర్తిగా చదివి అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశమై ధరణి అర్జీలు, భూముల మార్కెట్ విలువ పెంపు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాకి భూ సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. భూ దస్త్రాల పరిరక్షణ, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై అవగాహన కల్పించారు. హిందూ సక్సెషన్ యాక్ట్, భూ రికార్డుల యాక్టులను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. భూ బదలాయింపు ఎన్ని రకాలు ఉంటాయి.. వాటిని ఏ విధంగా నిర్ధారించుకోవాలనే విషయంపై అవగాహన ఉండాలని కోరారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయాలని.. పెండింగ్ మ్యుటేషన్, సక్సెషన్, కరెక్షన్ తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తహసీల్దార్లు, ఆర్డీఓ తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. భూమి మార్కెట్ విలువల నిర్ధారణ అంశంపై కమిటీలోని అధికారులు చర్చించాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయాలని కోరారు. ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అప్పగింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లర్లు మిల్లు సామర్థ్యం మేరకు మిల్లింగ్ చేసి ధాన్యాన్ని అప్పగించడం లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్లు తమ పరిధిలోని రైస్ మిల్లర్లపై ఒత్తిడి పెంచాలని, సకాలంలో ధాన్యం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుకుగాను భూ సమస్యలను పరిష్కరించి విద్యుత్ అధికారులకు అప్పగించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్, ఆర్డీఓ పద్మావతి, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జూడాల ఆందోళన బాట

- తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన



మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

పాలమూరు: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జూడాలు ఆందోళన నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ముఖద్వారం దగ్గర నిరసన వ్యక్తం చేయడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత ఆస్పత్రి ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ టెంట్‌లో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎనిమిది రకాల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాటపట్టారు. ఇందులో ప్రధానంగా జూనియర్ వైద్యులకు ప్రతి నెలా గ్రీన్ చానల్ ద్వారా ఉపకార వేతనాలు (స్టైఫండ్) మంజూరు చేయాలని, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్‌కు ప్రత్యేకంగా ఉపకార వేతనాలు ఇవ్వాలని, ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించాలని, జూనియర్ వైద్యులకు రక్షణ కల్పించాలని, కాకతీయ మెడికల్ కళాశాలలో రోడ్డు సమస్య పరిష్కరించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు వసతి గృహాలు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో వసతులు సమకూర్చాలని, తెలంగాణలో ఏపీ విద్యార్థుల కోసం కేటాయించిన 15 శాతం రిజర్వేషన్ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే వీటిపై ప్రభుత్వం స్పందించకపోతే మంగళవారం సైతం ఆందోళన కొనసాగుతుందని జూడాలు ప్రకటించారు.

ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ మంజూరు

- గోపాల్‌పేట సాంఘిక సంక్షేమ గురుకుల క్యాంపస్ సమీపంలో ఏర్పాటుకు అవకాశం

వనపర్తి: జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను ఈ నెల 20న సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి జారీ చేశారు. అలాగే ఏర్పాటుకు కావాల్సిన పూర్తి నివేదికను అందించాలని ఎమ్మెల్యే, అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభ్యర్థన మేరకు సీఎం సూచనతో గోపాల్‌పేట మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల సమీపంలో సుమారు 70 ఎకరాల ప్రభుత్వ స్థలంలో హబ్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో తొలివిడతగా ఏర్పాటు చేయనున్న ఎడ్యుకేషనల్ హబ్‌లలో వనపర్తికి స్థానం కల్పించాలని ప్రయత్నించగా.. సీఎం ఈ ప్రాంతంపై ఉన్న అభిమానంతో ఒప్పుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.50 కోట్లు మంజూరు..

కొంతకాలంగా అద్దెభవనాల్లో కొనసాగుతున్న పెద్దమందడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల భవన నిర్మాణానికి రూ.25 కోట్లు, వనపర్తి సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల భవన నిర్మాణానికి రూ.25 కోట్లు తన అభ్యర్థన మేరకు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న రెండు భవనాలకు నెలకు అద్దె రూ.95 వేలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి.. చిత్రంలో మండల అధికారులు

కొత్తకోట/కొత్తకోట రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని.. మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న భీమా ఫేస్–2 కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనుల వివరాలు, అందుకుగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లు, అధికారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తానని.. వెంటనే పూర్తి చేయాలని కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వ్యవసాయం, ఇళ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. జూరాల నీటితో చెరువులు, కుంటలు నింపాలని నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు బోయేజ్, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, పెంటన్న యాదవ్, సంద వెంకటేష్, విశ్వనాథం, శివరాజు, శివరాములు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు..

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షే పథకాలు అందేలా చూస్తామని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మిరాసిపల్లిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రోజురోజుకు పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీ ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతులకు త్వరలోనే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే పాఠ్య, రాత పుస్తకాలతో పాటు యూనిఫామ్స్ అందజేశారు. మండలపార్టీ అధ్యక్షుడు బీచుపల్లి, భీంరెడ్డి, సాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాసన్న, ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల అనుమతులపై కసరత్తు

- తనిఖీ చేపట్టిన ఎన్‌ఎంసీ బృందం
- నివేధికల ఆధారంగా ఆమోదం
- గుర్తింపు లభిస్తేనే మోక్షం



జోగులాంబ గద్వాల జిల్లా ఆస్పత్రిలో మాట్లాడుతున్న ఎన్‌ఎంసీ సభ్యులు

గద్వాల క్రైం: కొత్త మెడికల్ కళాశాల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. కళాశాల నిర్మాణానికి రూ.39 కోట్ల నిధుల విడుదల చేశారు. మంజూరైన వైద్య కళాశాల అనుమతుల కోసం సోమవారం ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, పట్టణ శివారులో ఉన్న కళాశాల భవనం పరిశీలించారు. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించి విద్యార్థులకు బోధన అందిచాలనే లక్ష్యంతో ఉన్నారు. ఎన్‌ఎంసీ సభ్యులు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌క్రాంతి, కళాశాల ప్రిన్సిపాల్ నుంచి పలు నివేదికలను తీసుకున్నారు. విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులు, బాల బాలికలకు ప్రత్యేక వెయిటింగ్ హాల్స్‌తో పాటు తరగతి గదులు, టాయిలెట్స్, ప్రయోగశాలలు, ఫర్నీచర్, విద్యుత్, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. వైద్య కళాశాలకు ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది నియామకం, వైద్య విద్యాబోధనతో పాటు చికిత్స అందించేందుకు అనువైన విభాగాలపై ఆరా తీశారు. మెడికల్ కళాశాల తరగతులను ఈ నెల లేదా వచ్చే నెలలో ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. మెడికల్ కళాశాలకు ఎన్‌ఎంసీ నుంచి అనుమతులు లభిస్తే 50 సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వైద్య విద్య కోసం ఈ ప్రాంత విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.

గుర్తింపు లభిస్తేనే ఆమోదం

కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాల ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నర్సింగ్ కళాశాల తరగతులు ప్రారంభించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి 150 పడకల నుంచి 300 పడకలు అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. మెడికల్ విద్యార్థులకు అవసరమయ్యే పలు మౌలిక వసతులు, సదుపాయాలపై దృష్టి సారించి పనులను వేగవంతంగా చేపట్టారు. రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయా? లేదా అంశాలను ఆస్పత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అయితే ఎన్‌ఎంసీ సభ్యులు ఇక్కడి అధికారులు ఇచ్చిన నివేదికలపై సంతృప్తి వ్యక్తం చేసి అన్ని విధాలుగా మెడికల్ కళాశాల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉందనే అంశాలపై గ్రీన్ సిగ్నల్ ఇస్తే త్వరలో బోధన తరగతులు అందుబాటులోకి రానున్నాయి. ఎన్‌ఎంసీ సభ్యులు డాక్టర్ నవీద్, దివ్యారీ దేవ్, నాగసుహేన్ ఉన్నారు.

ఎన్‌ఎంసీ సభ్యులతో 'పేట' కలెక్టర్ భేటీ



ఎన్‌ఎంసీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: నేషనల్ మెడికల్ కౌన్సిల్ సెంట్రల్ సభ్యులతో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాలలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మెడికల్ కళాశాలకు సంబంధించిన నియామకాలు, వివిధ అంశాలపై చర్చించారు. వైద్య కళాశాల నియామకాల ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్యమైందన్నారు. బయోమెట్రిక్ హాజరు, ఫ్యాకల్టీ, ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినందున త్వరలోనే నియమిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ రామ్ కిషన్, సూపరింటెండెంట్ రంజిత్ కుమార్, డీఎంహెచ్ఓ సౌభాగ్య లక్ష్మి, డాక్టర్లు, పాల్గొన్నారు.



పొలంలో వజ్రాల కోసం వెతుకుతున్న జనం

ఆకాశం నుంచి వజ్రాలు పడ్డాయంటూ వదంతులు



ఓ వ్యక్తికి దొరికిన రాళ్లు

కోస్గి: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణ శివారులోని బీసీ కాలనీ సమీపంలో రెవెన్యూ అధికారులు ఆలయ భూమిగా గుర్తించిన పొలంలో వర్షంతో పాటు ఆకాశం నుంచి వజ్రాలు నేలరాలాయని సోమవారం ఉదయం నుంచి వదంతులు చెలరేగాయి. దీంతో బీసీ కాలనీకి చెందిన మహిళలు వజ్రాల కోసం వెతికారు. అయితే కొన్ని గులకరాళ్లు మెరుస్తుండడం , కొన్ని వజ్రాల ఆకారంలో కనిపించడంతో ఈ విషయం ఆ నోట, ఈ నోట పట్టణమంతా వ్యాపించడంతో చాలా మంది జనం ఆ పొలం వద్దకు వచ్చి వజ్రాలను వెతికే పనిలోపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇలాంటి వదంతులు నమ్మవద్దని వారిని అక్కడి నుంచి పంపించారు. కాగా.. పోలీసుల రాకను గమనించిన కొందరు దొరికిన రాళ్లను తీసుకుని అక్కడి నుంచి జారుకున్నారు.

వీధి కుక్కల దాడిలో జింక మృతి

బిజినేపల్లి: వీధి కుక్కల దాడిలో జింక మృతి చెందింది. ఈ ఘటన సోమవారం ఉదయం ముస్లిం శ్మశానవాటిక సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రాయణపల్లి గుట్ట ప్రాంతంలో కర్వెన ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. అక్కడ జింకలకు నివాసయోగ్యంగా లేకపోవడంతో అందులో ఒకటి రాత్రి తిమ్మాజీపేట మండల కేంద్రం సమీప ప్రాంతాలకు వచ్చింది. వీధి కుక్కలు జింకను గమనించి దాడి చేసి చంపాయి. ఉదయం అటుగా వెళ్లిన కొందరు జింక కళేబరం కన్పించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకు ని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఇప్పటికే వీధి కుక్కల దాడిలో రెండు జింకలు గాయపడగ వాటిని పశు వైద్య అధికారులు చికి త్స చేసి సంరక్షించారు. ఇలా ప్రాజెక్టులో గుట్టలను కంపెనీల నిర్వాహకులు ఇష్టారీతిన తవ్వడంతో ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

బైకు అదుపుతప్పి యువకుడు మృతి

మదనాపురం: మండలంలోని ఎర్రగట్టు మైసమ్మ సమీపంలో సోమవారం ఓ వ్యక్తి బైక్ అదుపుతప్పి కింద పడి మృతి చెందాడు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అజ్జకొల్లు చెందిన నల్లబోతుల సత్యం (24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం తన స్నేహితులతో పాటు ఎర్రగట్టు మైసమ్మ వద్దకు విందుకి వెళ్లాడు. తిరుగుప్రయణంలో బైక్ అతివేగంగా నడుపుతూ రామన్‌పాడు శివారులోని అదుపుతప్పి కింద పడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి గట్టన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

గద్వాల క్రైం: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివ గుప్తా (30) జిల్లాకేంద్రంలోని రైల్వే క్యాంటీన్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తెల్లవారుజామున క్యాంటీన్‌కు వచ్చే క్రమంలో కర్నూలు వైపు వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి మనోజ్‌గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

రైలు కిందపడి ఆటో డ్రైవర్ ఆత్మహత్య

దేవరకద్ర: కౌకుంట్ల మండలం వెంకంపల్లి, పేరూర్ మధ్య రైల్వే గేటు సమీపంలో రైలు కింద పడి ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. చిన్నచింతకుంట మండలం చిన్న వడ్డెమాన్ చెందిన ఆటో నడిపే అంజి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి బలవన్మరణం

తెలకపల్లి: భార్యతో గొడవపడి క్షణికావేశంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ మండలం వనపట్లకు చెందిన బూషిపాగ బాలనాగయ్య (45) ఈ నెల 20న రాత్రి భార్య, కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి బయట నిద్రించాడు. ఉదయం లేచేసరికి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెదికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మండలంలోని దాసుపల్లి శివారు వాగు దగ్గర ఓ చెట్టుకు ఉరేసుకుని కుళ్లిపోయిన మృతదేహం అటుగా వెళ్తున్న వారికి కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కుటుంబసభ్యులు గుర్తించి రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. బాలనాగయ్యకు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పశువుల దొంగలకు రిమాండ్

ధరూరు: పశువులు దొంగతనం చేసిన వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని జాంపల్లికి చెందిన రంగారెడ్డి రెండు ఎద్దులను పొలం వద్ద కట్టేసి ఉంచగా.. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 18న కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా ఎద్దులను ఎత్తుకెళ్లిన వ్యక్తులను గుర్తించి పట్టుకున్నారు. ఎద్దులను ఎత్తుకెళ్లిన అమరచింతకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.80వేల నగదుతో పాటు బొలెరో వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కోటకొండలో రాస్తారోకో



కోటకొండలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- పెట్రోల్ బాటిళ్లతో మహిళల నిరసన



పెట్రోల్ బాటిళ్లతో నిరసన

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో ఏరువాక పండుగ రోజు జరిగిన ఘర్షణ మరునాడు తీవ్ర హింసకు దారితీసిన విషయం విధితమే. ఈ క్రమంలో దళితవాడకు చెందిన కొందరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దాడులకు పాల్పడిన వారిని పట్టుకోవాలంటూ బాధితుల పక్షాన పలు సంఘాల నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేపట్టగా ఎస్పీ యోగేష్ గౌతమ్ హామీతో ఆందోళన విరమించారు. దాడులకు కారణమైన వారిని పట్టుకునేందుకు పోలీసులు అదేరోజు రాత్రి గ్రామానికి వెళ్లగా కొందరు దొరకగా, ప్రధాన వ్యక్తులు పరారయ్యారు. ఎంత వెదికిన దొరకకపోవడంతో చివరకు వారి తండ్రులను ఠాణాకు తీసుకొచ్చారు.

5 గంటల పాటు..

అకారణంగా తమ భర్తలను అరెస్టు చేశారని ఆరోపిస్తూ సోమవారం మహిళలు రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద, జిల్లాకేంద్రంలో రాస్తారోకో, ఎస్పీ కార్యాలయం దగ్గర నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున గ్రామానికి చేరుకొని తెలంగాణ చౌరస్తాలో అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు ఐదు గంటల పాటు ఆందోళన చేశారు. అరెస్ట్ చేయాలని చూడగా మహిళలు, వారి బంధువులు పెట్రోల్ బాటిళ్లు పట్టుకుని నిప్పంటించుకుంటామని భయపెట్టారు. దీంతో చేసేది లేక పోలీసులు వెనక్కి తగ్గారు. ఠాణాలో ఉన్న వారిని వదిలిపెడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతోంది.

మైనింగ్ పరిశీలనను అడ్డుకున్న గ్రామస్తులు

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల ఊరగుట్టను సోమవారం మైన్స్ అండ్ మినరల్ మినీ కంపెనీకి చెందిన ముగ్గురు ప్రతినిధులు పరిశీలించేందుకు రాగా గ్రామస్తులు అడ్డుకొని వారిని గ్రామపంచాయతీ కార్యాలయంలో కూర్చోబెట్టారు. తవ్వకాలకు కాదని.. కేవలం చూడటానికి మాత్రమే వచ్చామని చెప్పడంతో వారితో మళ్లీ ఇటువైపు రామంటూ లిఖితపూర్వకంగా రాయించుకొని పంపించారు. గతంలో కూడా ఇలాగే వచ్చిన వారిని గ్రామస్తులు కొట్టి పంపించారు. అధికారులు స్పందించి మైనింగ్ అనుమతులు రద్దు చేసి సాగుకు అనుమతులు ఇవ్వాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు పూర్తిగా తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు కేవలం 19 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పేర్కొన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 750 క్యూసెక్కుల, ఆవిరి రూపంలో 135 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 840 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 900 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 2,750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.434 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం

- చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నగదు, సెల్‌ఫోన్

నారాయణపేట: జల్సాలకు అలవాటు పడి తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసిన చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ లింగయ్య వెల్లడించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20న రాత్రి మాగనూర్ మండలంలోని వర్కూర్‌లో ఇంటికి తాళాలు పగులగొట్టి బంగారు నగలు, వెండి, వస్తువులను ఎత్తుకెళ్లారు. ఇంటి యజమాని బొజ్జ మొల్ల సుజాత ఫిర్యాదు మేరకు 21న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 24న ఉదయం 7 గంటలకు నల్లగట్టు మారెమ్మ గుడి వద్ద ఇద్దరు అనుమానితులు తిరుగుతున్నట్లు మాగనూర్ పోలీసులకు సమాచారం అందడంతో వారిని పట్టుకుని విచారించారు. వారిలో ఒకరు వర్కూర్ చెందిన ఊరుముందర నరేష్ అలియాస్ కార్తీక్, మరొకరు అతని స్నేహితుడు కర్నూల్ జిల్లా దేవనకొండ మండలం కోటకొండకు చెందిన బోయ వీరేంద్ర ఉన్నారు. ఇద్దరు 3 నెలలుగా పరిచయం ఏర్పడి జల్సాలకు అలవాటు పడ్డారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే 19న వర్కూర్ గ్రామానికి వచ్చారు. అక్కడే రెండు రోజులు ఉండి రెక్కీ నిర్వహించి తాళాలు వేసిన ఇళ్లను అదునుగా చూసి నరేష్ ఇంటి వెనకాల ఉన్న రెండు ఇళ్లకు తాళం వేసి ఉన్నవాటిని గమనించి 20న రాత్రి చోరీకి పాల్పడ్డారు. వారి ఇంటిలో 6 తులాల బంగారు ఆభరణాలు, 1.5 తులాల వెండి, నగదు, ఒక ఫోన్ ఎత్తుకెళ్లారు. వారి నుండి 5.5 తులల బంగారు ఆభరణాలు, మరియు 1.5 వెండి వస్తువులు, ఫోన్, రూ.8,560 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని నారాయణపేట కోర్టులో హాజరు పరిచి, కోర్టు ఆదేశాల మేరకు జైలుకు పంపించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

తుదిదశకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ



బదిలీల వివరాలను జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మికి వివరిస్తున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మూడు రోజుల క్రితం గవర్నమెంట్ బాడీ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పదోన్నతులకు సంబంధించి వెబ్ ఆప్షన్ ఇవ్వగా సోమవారం ఉదయం అర్హులైన మొత్తం 49 మందికి లభించాయి. ఇందులో 21 మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్, 28 ఎస్జీటీలు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వీరికి ఆర్డర్లు ఇవ్వగా మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరారు. వీరితోపాటు జిల్లాలోని వివిధ లోకల్ బాడీ పాఠశాలల్లో పనిచేస్తున్న 397 మంది ఎస్జీటీలు గతంలో వెబ్ ఆప్షన్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో వారికి కూడా ప్రభుత్వం నుంచి ఆర్డర్ కాపీలు డీఈఓ కార్యాలయానికి చేరాయి. అయితే దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అనంతరం వారికి కూడా మంగళవారం మధ్యాహ్నం వరకు బదిలీ ఆర్డర్ ఇవ్వనున్నారు. అయితే లోకల్ బాడీలో ప్రమోషన్లు పొందిన వారు దీనిపై తమకు ఇష్టం లేకపోతే వెనక్కి తీసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఇప్పుడు బదిలీలకు సంబంధించిన ఆర్డర్‌లు తీసుకునే ఉపాధ్యాయులు మాత్రం కచ్చితంగా బదిలీ కావాలని అధికారులు సూచిస్తున్నారు. వెనక్కి తీసుకునేందుకు అవకాశం లేదు. ఈ క్రమంలో మొత్తం 32 మంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దాదాపు 20 మంది వరకు ఉపాధ్యాయులు స్పౌజ్‌లు తప్పుగా దరఖాస్తు చేసుకున్నట్లు గమనించిన విద్యాశాఖ అధికారులు మరోసారి వారికి వెబ్ ఆప్షన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించి మళ్లీ దరఖాస్తు చేయించినట్లు డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీలకు సంబంధించి పూర్తి ప్రక్రియను సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి

- మృతదేహంతో ఆస్పత్రి వద్ద ఆందోళన



గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన గర్భిణి ఆఫ్రిన్ (28)కు ఆరు రోజుల క్రితం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక అనంత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సిజేరియర్ ద్వారా ఆమెకు ప్రసవం చేశారు. ఈక్రమంలో బాలింత పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అక్కడ ఆమెకు రెండు రోజులపాటు వైద్యం అందించినప్పటికీ.. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉండటంతో శుక్రవారం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. దీంతో కుటుంబ సభ్యులు బాలింత మృతదేహంతో స్థానిక అనంత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకొని ఆందోళన చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందని ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యులు, వైద్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకొని శాంతింపజేశారు. భార్య మృతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భర్త అన్వర్, కుటుంబ సభ్యులు కోరారు. ఈ విషయంపై ఆస్పత్రి వైద్యులను 'సాక్షి' వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

'ఆర్‌ఐపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

జడ్చర్ల: బాలానగర్ మండలం ఆర్‌ఐ వెంకట్‌రెడ్డిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని ట్రెసా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు వంగ రవీందర్, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. ఎమ్మెల్యే ఫిర్యాదుపై స్పందించిన ఉన్నతాధికారులు ఆర్‌ఐని సస్పెండ్ చేయడం ఎంతమాత్రం తగదని, సస్పెన్షన్‌ను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనుచరులు సైతం ఆర్‌ఐని పరుష పదజాలంతో దూషించడం దారుణమన్నారు. ఓవైపు సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూ సమస్యల పరిష్కారం కోసం రేయింబవళ్లు కృషిచేయాలని చెబుతున్నారని, దీంతో సమస్యల పరిష్కారం కోసం కుటుంబ సమస్యలను పక్కనపెట్టి పనిచేస్తున్న తమ సిబ్బందిపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు. సిబ్బంది కొరతతో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలు సైతం వినియోగించుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం పనిచేస్తున్నామని, ఇలాంటి సమయంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తమపై తప్పడు ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, ఆర్‌ఐ వెంకట్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం రెవెన్యూ మంత్రి పొంగులేటిని కలిసి సమస్యలను వివరిస్తామని చెప్పారు.

ముఖంపై నీళ్లు చల్లి.. నగలు అపహరణ

కేటీదొడ్డి: గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ ముఖంపై నీళ్లుచల్లి నగలు ఎత్తుకెళ్లిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. మండలంలోని కుచినెర్లకు చెందిన వాణి ఉదయం ఇంటి ఎదుట ముగ్గు వేస్తుండగా ఓ మహిళ, ఒక పురుషుడు ద్విచక్ర వాహనంపై వచ్చి నిలిపారు. మహిళ వచ్చి తాగడానికి నీళ్లివాలని కోరగా.. ఆమె ఇంట్లోకి వెళ్లి తెచ్చి ఇచ్చింది. అదే నీటిని వాణి ముఖంపై చల్లి ఒంటిపై ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు లాక్కొని వాహనంపై ఇద్దరు కలిసి పరారయ్యారు. కాసేపటికి తేరుకున్న ఆమె వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని.. అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



మల్రిపల్లిలో పాఠశాల వరండాలో కూర్చున్న విద్యార్థులు

10 గంటలైనా తెరుచుకోని ప్రభుత్వ పాఠశాల

చారకొండ: మండలంలోని మల్రిపల్లి ప్రాథమిక పాఠశాల సోమవారం 10 గంటలైనా తెరుచుకోలేదు. దీంతో విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయిని పాఠశాల బయటే నిరీక్షించాల్సి వచ్చింది. పాఠశాల హెచ్‌ఎం సుభాషిణి హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈక్రమంలో ఉదయం 8:45 గంటలకు తెరుచుకోవాల్సిన పాఠశాల రోజూ ఆలస్యమవుతున్నట్లు స్థానికులు తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న హెచ్‌ఎంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్ రెడ్డిని వివరణ కోరగా.. పాఠశాలలో విచారణ నిర్వహిస్తామని, సమయపాలన పాటించని హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీఏసీఎస్‌లు రైతుల అభ్యున్నతికి సూచికలు



సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర నాబార్డ్ సీజీఎం సుశీల, తదితరులు

అయిజ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) రైతుల అభ్యున్నతికి సూచికలు అని నాబార్డ్ తెలంగాణ రాష్ట్ర సీజీఎం సుశీల అన్నారు. సోమవారం మండల కేంద్రం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా నిర్వహిస్తున్న ఫర్టిలైజర్, క్రిమిసంహారక మందుల దుకాణాన్ని, సూపర్ మార్కెట్‌ను నాబార్డ్ డీజీఎం శ్వేతా సింగ్‌తో కలిసి సీజీఎం సుశీల సందర్శించారు. వాటి పనితీరు గురించి పీఏసీఎస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీజీఎం సుశీల మాట్లాడుతూ.. నిస్వార్థంగా సహకార సంఘాల అభివృద్ధికోసం కృషి చేస్తే ప్రత్యక్షంగా రైతాంగాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. మహబూబ్‌నగర్ డీసీసీబీ బ్యాంక్‌తో పాటు జిల్లాలో అభివృద్ధి చెందుతున్న కొన్ని సహకార సంఘాల్లో అయిజ సొసైటీ ఒకటని అన్నారు. సొసైటీ అభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం హయాంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని సొసైటీకి కేటాయించిందని, అందులో గోదాంలు నిర్మించాలని, పులికల్ సమీపంలో నాగలదిన్నె బ్రిడ్జి సమీపంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మధుసూదన్ రెడ్డి వారిని కోరారు.